బాల్.. బాల్‌కు బెట్టింగ్

- ఆన్‌లైన్ వేదికగా క్రికెట్ పందేలు
- బుకీలకు అడ్డాగా హైదరాబాద్
- మియాపూర్‌లో బెట్టింగ్ ముఠా అరెస్ట్
- రూ. 43.5 లక్షలు స్వాధీనం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : క్రికెట్‌బుకీలు హైదరాబాద్ నగరాన్ని అడ్డాగా చేసుకుని జోరుగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తు న్నారు. ముఖ్యంగా ఐపీఎల్ మ్యాచ్‌ల బెట్టిం గ్ కోసం యువతను ఆకర్షించేందుకు ఆన్ లైన్ వేదికగా వినూత్న రీతుల్లో ప్రకటనలు గుప్పిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో గతంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే వారే ఈసారి కూడా పెద్ద ఎత్తున బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. బెట్టింగ్‌పై ఆసక్తి ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని బాల్, బాల్‌కు బెట్టింగ్ నిర్వ హిస్తున్నారు. అలాగే క్రికెట్ మ్యాచ్‌లలో క్రికెటర్లు సాధించే పరుగులు, బౌలర్లు సాధించే వికెట్లపైనా పందేలు కాస్తున్నారు.

మ్యాచ్‌లలో గెలుపు, ఓటము లపైనా భారీ ఎత్తున బెట్టింగ్‌లకు దిగుతు న్నారు. బెట్టింగ్ కట్టే వారి ఆసక్తి మేరకు పందేలు నిర్వహిస్తు న్నారని, బెట్టింగ్ నిర్వహించే వారు ఫోన్లు చేసి పంటర్ల సాయంతో డబ్బులు వసూలు చేస్తున్నా రని పోలీసులు వివరిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై కన్నేసిన నగర పోలీసులు వారిపై ఉక్కుపాదం మోపు తున్నా బెట్టింగ్ రాయుళ్లు ప్రదేశాలు మారుస్తూ పెందేలను కొనసాగిస్తున్నారు.

ఆన్‌లైన్ వేదికగా

ఐపీఎల్ మ్యాచ్‌లబెట్టింగ్‌నిర్వహకులు పందేలకు సంబంధించిన లావాదేవీలు మొత్తం కూడా గూగుల్ పే, ఫోన్ పే, పేటిఎం ద్వారా నిర్వహిస్తున్నారు. బెట్టింగ్‌లో డబ్బులు పోగోట్టుకున్న వారి నుంచి ఆన్‌లైన్ ద్వారానే బెట్టింగ్ డబ్బులు తీసుకోవడమే కాకుండా చెల్లింపులు కూడా అలాగే చేస్తున్నారు. ఇప్పటి వరకు ఐపీఎల్ ప్రారంభమైనప్పటి ఇప్పటి వరకు హైదరాబాద్ నగరంలో దాదాపు 10 ముఠాలను పోలీసులు అరెస్టు చేశారు. బెట్టింగ్ నిర్వహకులు ముఖ్యంగా క్రికెట్‌లైన్‌గురు, కింగ్‌ఎక్చేంజ్, డెల్టా ఎక్చేంజ్.ఇన్ తదితర యాప్‌ల సాయంతో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. వీటిలో ప్రతి బాల్‌కు బెట్టింగ్ నిర్వహిసున్నారు. బెట్టింగ్‌లకు పాల్పడే వారి పేర్లను రిజిస్టర్‌లో నమోదు చేసి యూజర్ ఐడి, పాస్‌వర్డ్ ఇవ్వడంతో ఆన్‌లైన్‌లో చూసి బెట్టింగ్ కట్టాల్సి ఉంటుంది. ఈ విధంగా వారి వివరాలను నమోదు చేసుకుంటారు. గెలిచిన వారికి డబ్బులు ఇవ్వడం ఓడిపోయిన వారి నుంచి కలెక్షన్ ఏజెంట్ డబ్బులు వసూలు చేస్తున్నారు.

చేతులు మారుతున్న రూ. కోట్లు

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లలో వందలాది కోట్ల రూపాయలు బెట్టింగ్ మొత్తాలు చేతులు మారుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో బంతి.. బంతికి పందెం కాస్తూ పందెంరాయుళ్లు యువతను ఆకర్షిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇటవల ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రారంభంలో కాస్త స్తబ్ధుగా కనిపించిన బెట్టింగ్ ముఠాలు ఇటీవల వేగం పెంచుతున్నారని వివరిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసుల నిఘా నేపథ్యంలో బెట్టింగ్ నిర్వాహకులు ఆన్‌లైన్ వేదికలగా పందేలు నిర్వహిస్తున్నారు. బెట్టింగ్‌లకు సంబంధించి దాదాపు 100కు పైగా యాప్‌లు వినియోగంలో ఉన్నాయని, దీంతో బెట్టింగ్ నిర్వాహకులను పట్టుకోవడం కష్టతరంగా మారుతోం దని పోలీసులు చెబుతున్నారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువకులూ ఈ బెట్టింగ్ వలలో చిక్కుకుంటున్నారని, బెట్టింగ్‌ల కోసం రుణ యాప్‌లను ఆశ్రయిస్తున్నారని పేర్కొం టున్నారు. ఆన్‌లైన్‌లో రుణాలు అందించే వందలాది యాప్‌లు సైతం యువతను ఆకర్షిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. యువకులే టార్గెట్‌గా ఈ బెట్టింగ్‌లు జరుగుతున్నాయని, కొందరు మైనర్లు సైతం బెట్టింగ్ వలకు చిక్కుతున్నారని తెలిపారు. బెట్టింగ్ నిర్వహకులు నగర శివారులోని ఫోమ్‌హౌస్‌లు, రిసార్టులను అడ్డాగా చేసుకొని పందేలను నిర్వహిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

మియాపూర్‌లో బెట్టింగ్ ముఠా

మియాపూర్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి నిందితుల నుండి రూ.43 లక్షల 57 వేలను స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాతృశ్రీ నగర్ లోని శ్రీనిధి సర్వీస్ అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నంబర్ 505 పై దాడి చేసిన పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి నగదు రూ.43 లక్షల 57 వేలతో పాటు ల్యాప్ టాప్స్, ట్యాబ్స్, మొబైల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు నర్సారావు పేటకు చెందిన శాఖమూరి వెంకటేశ్వర్ రావు అలియాస్ చిన్ను కీలకంగా వ్యవహరిస్తూ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని పోలీసులు గుర్తిం చారు. ఈ బెట్టింగ్ ముఠాలో ఆలూరు త్రినాథ్, మనం రాజేష్, బొల్లె స్వామి, మార్పెన్న గణపతి రావులు బుకీలుగా ఉన్నారని, వీరందరూ కలిసి క్రికెట్ లైవ్ గురు, లక్కీ ఆన్‌లైన్ యాప్, కాల్ కాన్ప రెన్స్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మత్తుపై పోలీసు దాడులు

డ్రగ్స్, గంజాయి, సిగరెట్లు స్వాధీనం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: మత్తు పదార్థాల కట్టడికి పోలీసులు నిర్వహించిన దాడులలో ఎండీఎంఏ డ్రగ్స్, గంజాయి, విదేశీ సిగరెట్లు పట్టుబడ్డాయి. వివరాల్లోకి వెళితే..సనత్‌నగర్‌కు చెందిన యువకులు గోవాలో పుట్టిన రోజు వేడుక జరుపుకుని తిరిగొస్తూ డ్రగ్స్ తీసుకువస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో రాజేంద్రనగర్ ఎస్ వోటీ పోలీసులు బుధవారం సనత్ నగర్‌లో సోదాలు చేపట్టారు. ఓ ఇంట్లో ఎండీఎంఏ డ్రగ్స్ ను గుర్తించి సీజ్ చేశారు. 4 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ తో పాటు 5 గ్రాముల గంజాయి, ఓసీబీ ఫ్లేవర్స్ డ్రగ్స్ సీజ్ చేశారు. ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఎండీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

రంగారెడ్డి జిల్లాలోని దుండిగల్‌లో 1.35 కేజీల గంజాయి మేడ్చల్ ఎస్ఓటీ బృందం సీజ్ చేసింది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తెచ్చి నగరంలో విద్యార్థులకు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఓటీ అధికారులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తక్కువ టైంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో నిందితులు గంజాయి దందాకు తెరలేపినట్లు పోలీసుల విచారణలో తేలింది.

నకిలీ సిగరెట్స్ స్మగ్లింగ్

నగరంలోని గగన్ పహాడ్ వద్ద ఓ పార్కింగ్ స్థలంలో రూ. 2 కోట్ల విలువ చేసే వివిధ బ్రాండ్ల సిగరెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బీహార్ రాష్ట్రం నుండి పాట్నా మీదుగా హైదరాబాద్‌కు ఓ భారీ కంటైనర్ లో సిగరెట్స్ తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ముషీరాబాద్ లోని శ్రీరామ ఎంటర్ ప్రైజెస్ పేరు మీద సిగరెట్లను డెలివరీ చేశారని, శ్రీరామ్ ఇంటర్ ప్రైజెస్ చిరునామా ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వివరిస్తున్నారు. ఈ కేసులో బీహార్‌కు చెందిన నాలుగు అరెస్ట్ చేశామని, మరోకరు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే దానంపై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఎంఎల్ఏ పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయించిన దానంపై అనర్హత వేటు వేయాలని ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని పిటిషన్‌లో పేర్కొన్నారు. బిఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్‌ను సికిందరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ స్పీకర్ ఇంకా దానం అనర్హత వేటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడంతో హైకోర్టును ఆశ్రయించామని పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. దానం పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై త్వరగా చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించాలని ఆయన న్యాయస్థానాన్ని కోరారు.

నోటీసులు ఇవ్వకుండానే విచారణ

- తీహార్ జైల్లో సీబీఐ విచారణపై కవిత తరపు న్యాయవాదులు
- రౌజ్‌అవెన్యూ కోర్టులో వాదనలు
- ఏప్రిల్ 26కు విచారణ వాయిదా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తిహార్ జైల్లో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్సీ కవితను ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాల కేసులో ప్రశ్నించడానికి ఇచ్చిన అనుమతిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ ఏప్రిల్ 26కు వాయిదా పడింది. బుధవారం ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులోని సీబీఐ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజ ఎదుట జరిగిన విచారణలో కవిత తరపు న్యాయవాదులు సీబీఐ విచారణ జరపడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఏప్రిల్ 5న సాయంత్రం గం. 5.30కు స్పెషల్ కోర్టు అనుమతి మంజూరు చేయగా.. మర్నాడే జైలుకు వెళ్లి సీబీఐ అధికారులు ప్రశ్నించారని, ఎలాంటి ముందస్తు నోటీసులు, సమన్లు జారీ చేయకుండా ప్రశ్నించారని కోర్టుకు వెల్లడించారు. సీబీఐ విచారణను సవాల్ చేస్తూ తాము దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ జవాబు కూడా ఇవ్వలేదని తెలిపారు. కవిత తరపున న్యాయవాదులు నితేశ్ రాణా, మోహిత్ రావు వాదనలు వినిపించగా.. సీబీఐ కూడా విచారణకు హాజరై తాము తిహాడ్ జైల్లో కవితను ప్రశ్నించినట్టు వెల్లడించింది. కవిత పిటిషన్‌పై జవాబు ఇవ్వాల్సిన అవసరం లేదని సీబీఐ తరపు న్యాయవాదులు తెలిపారు. వాదోపవాదనల అనంతరం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకుండానే.. తదుపరి విచారణ ఏప్రిల్ 26 మధ్యాహ్నం గం. 12.00కు వాయిదా వేస్తూ స్పెషల్ జడ్జి కావేరి బవేజ ఆదేశాలు జారీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడికి ఊరట

- కండిషన్ బెయిల్ మంజూరు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజా భవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టిన కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి రాహిల్‌కు ఊటర లభించింది. ఈ కేసులో చంచల్ గూడ జైలులో ఉన్న రాహిల్‌కు బుధవారం నాడు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈక్రమంలో రూ.20 వేల చొప్పున రెండు షూరిటీలు ఇవ్వాలని ఆదేశించింది. కాగా ప్రజాభవన్ బారికేడ్ల ధ్వంసం కేసులో రాహిల్‌ను మరింత విచారణ చేసేందుకు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ నాంపల్లి కోర్టు కొట్టేయడంతో పాటు హైకోర్టు ఆదేశాలను పాటించాలని సూచిం చింది. కాగా, ప్రజా భవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టిన కేసులో రాహిల్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం అతడికి 14 రోజుల జ్యుడి షియల్ రిమాండ్ విధించింది. జ్యుడిషియల్ రిమాండ్‌లో భాగంగా రాహిల్ ప్రస్తుతం చంచల్ గూడ జైలులో ఉన్నారు. తాజాగా నాంపల్లి కోర్టు కండీషన్ బెయిల్ మంజూరు చేయడంతో రాహిల్ జైలు నుంచి విడుదల కానున్నాడు.

సీఎం కుర్చీ కోసం కాంగ్రెస్‌లో కొట్లాట షురూ

- బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్‌లో సీఎం కుర్చీ కోసం కొట్లాట మొదలైందని, రోజు రోజుకూ తీవ్రరూపం దాలుస్తోందని బీజేపీ బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం పదవి కోసం పది మంది పోటీపడుతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీ నుంచి ఎప్పుడు దిగిపోతారోనని ఆ నేతలు ఎదురుచూస్తున్నారనిచెప్పారు. బుధవారం నాంపల్లి లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తనను కలిసిన విలేకరులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రెండేళ్లు పదవి అయిపోయాక సీఎం పదవి నుంచి రేవంత్ దిగిపోతారా..?, ఏదైనా కేసులో ఇరుక్కుని పదవి వీడుతారా..? అని సీనియర్ నేతలు చూస్తున్నా రని స్పష్టం చేశారు. తనతో ఉన్న 25 మంది ఎమ్మెల్యేలకు తోడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కలుపుకుని సీఎం రేవంత్‌రెడ్డి సొంత దుకాణం పెట్టుకోవటానికి సిద్ధమయ్యారని చెప్పారు. అదే సమయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా 10 మంది ఎమ్మెల్యేలతో సీఎం కుర్చీ కోసం పోటీకి సై అంటున్నారని తెలిపారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో ఓటమి ఎదురు కానుందని రేవంత్ రెడ్డి స్వయంగా ఒప్పుకున్నారని, ఈ వ్యాఖ్యలతో సీఎం తన ఇమేజ్‌ను తానే తక్కువ చేసుకున్నారని వ్యాఖ్యానించారు. సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం వ్యాఖ్యలు చూస్తుంటే ఆయన ఎంత అభద్రతా భావంలో కూరుకుపోయారో అర్థం చేసుకోవచ్చన్నారు. అభద్రతా భావంతో ఉన్న రేవంత్‌రెడ్డి మద్దతుగా నిలిచే ఎమ్మెల్యేల సంఖ్యను పెంచుకునేందుకు గేట్లు తెరిచినా కనీసం 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కూడా కాంగ్రెస్‌లో చేర్చుకోలేకపోయారని ఎద్దేవా చేశారు.

ఘనంగా సాలార్ 16వ వర్ధంతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎంఐఎం మాజీ అధ్యక్షుడు, దివంగత ఎంపీ సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ(సాలార్) 16వ వర్ధంతిని మజ్లిస్ పార్టీ హైదరా బాద్‌లో ఘనంగా జరుపుకుంది. ఆగాపురాలోని దర్గా హజ్రత్ ముహమ్మద్ హసన్ (ర.అ.) ఆవరణలో గల సలావుద్దీన్ ఒవైసీ సమాధి వద్ద ఎంఐఎం చీఫ్, సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు సాలార్ సమాధిపై చాదర్, పూలమాలలు వేసి దివంగత నేతకు నివాళులర్పించారు. అంతకు ముందు మధ్యాహ్నం పార్టీ కేంద్ర కార్యాలయం దారుస్సలాంలో వందలాది మంది అభిమానులు దుఆతో పాటు నాతియా కలాం చదివారు. ఈ కార్యక్రమంలో ఒవైసీ బ్రదర్స్‌తో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ శాసనసభ్యుడు సయ్యద్ అహమద్ పాషా ఖాద్రీ, ఎమ్మెల్యేలు అహమద్ బిన్ అబ్దుల్లా బలాలా, మాజిద్ హుస్సేన్, మీర్ జుల్ఫీఖార్ అలీ, కౌసర్ మొహియుద్దీన్, ముబీన్, జాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ నువ్వు సీఎంవా? చెడ్డీ గ్యాంగ్ సభ్యుడివా?

- ఇచ్చిన హామీలు పక్కన పెట్టి ఎన్నికల డ్రామాలు
- రాహుల్, ప్రియాంక, రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే: హరీష్‌రావు

ఉమ్మడి మెదక్, ప్రభ న్యూస్ బ్యూరో : రేవంత్ రెడ్డి నువ్వు సీఎం వా.. లేక చెడ్డీ గ్యాంగ్ సభ్యుడివా అని, కాంగ్రెస్ నాయకులు చెప్పేవన్నీ అబద్ధాలే అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బుధవారం పటాన్ చెరులో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ చెప్పే మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, ఆచరణ సాధ్యం కానీ అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ నైజమ్ అన్నారు. మార్పు పాలన అంటూ ఉన్న సంక్షేమ పథకాలకు కోతపెట్టారని, కాంగ్రెస్ పాలన పాలపొంగులా ఉంటుందన్నారు. 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు 2,500 ఇస్తామన్నారు. రాష్ట్రంలోని 1.42 కోట్ల మంది మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ బాకీ పడిందన్నారు. ఇక 42 లక్షల పింఛన్ దారులు రాష్ట్రంలో ఉన్నారని వారికి నెలకు 4000 ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రగల్భాలు పలికిన రాహుల్, ప్రియాంకగాంధీ, రేవంత్ రెడ్డిలు ఇప్పుడా ఊసే లేకుండా తోక ముడిచారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దారుణంగా మోసం చేసిందని రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా ఇవ్వడం లేదని అన్నారు. కేసీఆర్ కిట్టు బంద్ అయిందని, కల్యాణ లక్ష్మికి తులం బంగారం, వడ్లకు బోనస్ 500 ఏం చేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

వరి పంటకు బోనస్ 500 ఇవ్వాలని మాజీ సీఎం కేసీఆర్ అడిగితే సీఎం రేవంత్ రెడ్డి సూటిగా సమాధానం చెప్పకుండా అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. నువ్వు సీఎం వా లేక చెడ్డి గ్యాంగ్ సభ్యుడివా అని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ఎన్నికల కోసం డ్రామాలాడుతున్నా రన్నారు. ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తూ.. రెండు లక్షల రుణ మాఫీ చేయాలని రైతు భరోసా ఇవ్వాలని కరెంట్ సరఫరా చేయాలని, అసంబద్ధ వార్తలు, లీక్ వార్తలు మరెన్నో రోజులు సాగవన్నారు.

రఘునందన్ రావు బాగా పని చేస్తే దుబ్బాకలో ఎందుకు గెలవలేదు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మెదక్ లోక్ సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బాగా పని చేస్తే దుబ్బాకలో ఎందుకు గెలవలేదు? అని బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. దుబ్బాక ప్రజలు రఘునందన్ రావును ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించార న్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. మెదక్ లోక్ సభ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. భవిష్యత్తు అంతా బీఆర్ఎస్‌దేనని... మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మన ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేసే పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శాసన సభ సాక్షిగా అబద్ధాలు చెప్పారని విమర్శించారు. ఎన్నో హామీలు ఇచ్చి రైతులను మోసం చేశారన్నారు.

కాంగ్రెస్, మజ్లిస్ పొత్తుపై రాజుకుంటున్న రగడ

- రాష్ట్రంలో కాంగ్రెస్ అత్యంత శక్తివంతం
- పీసీసీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఖాన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య పొత్తు కుదిరిందని కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ చేసిన కామెంట్స్ లోక్‌సభ ఎన్నికల వేళ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలో మజ్లిస్, కాంగ్రెస్‌ల మధ్య పొత్తుపై ఫిరోజ్ ఖాన్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేయడం దుమారం లేపింది. ఎంఐఎంతో పొత్తు విషయమై అధిష్టానం ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదని ఖాన్ పేర్కొన్నారు. హైదరాబాద్, ఖమ్మం నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించలేదన్నారు.

ప్రత్యేకంగా హైదరాబాద్ లోక్‌సభ నుంచి ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థులను ప్రకటించినా, కాంగ్రెస్ ప్రకటించక పోవడంతో రెండు పార్టీల మధ్య సయోధ్య ఉండేలా కనిపిస్తోందని ఖాన్ అభిప్రాయ పడ్డారు. పొత్తు విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా, దానికి కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు. మజ్లిస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని అధిష్టానం ఆదేశిస్తే, అసదుద్దీన్ ఒవైసీ గెలుపుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కేవలం ఎన్నికల వరకే సహకరిస్తానని, ఎన్నికల తర్వాత ఎంఐఎంపై తన పోరాటాన్ని యథావిధిగా కొనసాగిస్తానని ఖరాఖండిగా చెప్పారు. హైదరాబాద్ నుంచి అసదుద్దీన్ ఒవైసీని ఓడించడం నా ఒక్కడికే సాధ్యమని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా రాష్ట్రంలో భారాసను అంతం చేయడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యంత శక్తివంతంగా ఉందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పార్టీని ఊహించని విధంగా మరింత బలోపేతం చేశారని ఖాన్ కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన పథకాలపై అమలు చేయలేక పోతే ఓటేయకపోడదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ 13 లోక్‌సభ సీట్లకు పైనే సాధిస్తోందని ఫిరోజ్ ఖాన్ జోస్యం చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసే ప్రజలు ఓటేస్తారన్నారు. ఖమ్మం, హైదరాబాద్ స్థానాలకు అభ్యర్థులను త్వరలో ఖరారు చేయనున్నారన్నారు.

టెట్ దరఖాస్తు గడువు 20 వరకు పొడిగింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉపాధ్యాయ నియామక పరీక్ష(డీఎస్సీ) రాయాలనుకునే అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డీఎస్సీకి అర్హత పరీక్షగా నిర్ణయించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్-2024) దరఖాస్తుల గడువును పొడిగించింది. వాస్తవానికి బుధవారం టెట్ దరఖాస్తు గడువు ముగిసింది. అయితే ఇంకా చాలా మంది నిరుద్యోగులు టెట్‌కు దరఖాస్తు చేసుకోలేదని గుర్తించిన విద్యాశాఖ దరఖాస్తు గడువును పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించింది. నిరుద్యోగుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న అంశం కావడంతో సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం టెట్ దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడిగించింది. దాంతో పాటూ ఈ నెల 11 నుంచి 20 వరకు అప్లికేషన్లను ఎడిట్ చేసుకునే అవకాశం కూడా కల్పించింది. ఈ నేపథ్యంలో డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న ఉపాధ్యాయ అభ్యర్థులు టెట్ దరఖాస్తు గడువు పొడిగింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ పిలుపునిచ్చింది. మరోవైపు టెట్ హాల్ టికెట్ల జారీ తేదీని కూడామార్చే యోచనలో విద్యాశాఖ ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం టెట్ హాల్‌టికెట్ల జారీ తేదీ ఏప్రిల్ 15న నిర్ణయించగా ప్రస్తుతం దరఖాస్తు తేదీని పొడిగించిన నేపథ్యంలో ఆ తేదీని కూడా మార్చనున్నారు.

ఫేక్, లీక్ వార్తలతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కాంగ్రెస్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

సూర్యాపేట, ప్రభన్యూస్ ప్రతినిధి: అమలు చేయలేని హామీలను ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఫేక్, లీక్ వార్తలతో ప్రభుత్వాన్ని నడిపిస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సూర్యాపేట నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణా రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో తొమ్మిదిన్నర ఏండ్లు రైతులు, మహిళలకు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కేసీఆర్ చేపట్టారని వివరించారు. మార్పు పేరుతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అసంబద్ధమైన హామీలను ప్రజలు నమ్మి మోసపోయారని పేర్కొన్నారు. వంద రోజుల్లోనే హామీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు హామీలపై నోరు మెదపకుండా కాళేశ్వరం కుంగిందని, ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ప్రజలను పక్కదోవ పట్టించేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వంలోకి రాగానే డిసెంబర్ 9వ తేదీనే రుణమాఫీ, పెన్షన్‌ల పెంపు, రైతు భరోసా అమలు చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ప్రతి పక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన తీరుగా మాట్లాడుతూ పబ్బం గడుపుతున్నారన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రకృతితో వచ్చిన కరువు కాదని కాంగ్రెస్ నాయకుల అవగాహన లేమితో తెచ్చిన కరువుతో రైతాంగం ఇబ్బంది పడుతుందని దుయ్యబట్టారు. లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయినా మంత్రి వర్గం కనీసం సమీక్ష చేయకపోవడం దుర్మార్గమన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రతి ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారాన్